## క్లుప్తంగా

### రేపు ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కందుకూరు: మండల పరిధి సార్లరావులపల్లిలో ఈ నెల 22న పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు మాజీ సర్పంచ్ రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, మండల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

### పదవీ కాలం ముగిసింది

కందుకూరు: ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడి పదవీ కాలం ఈ నెల 14తో ముగిసిందని మైనార్టీ సీనియర్ నాయకుడు, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ సులేమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఆగస్టు 14న రెండేళ్ల కాలానికి అధ్యక్షున్ని ఎన్నుకోగా.. పదవీ కాలం పూర్తయిందన్నారు. త్వరలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

### అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు కరుణానిధి, రవినాయక్

మీర్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన హోటల్ షెడ్డును తొలగించాలని మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ కార్పొరేటర్లు ముత్తంగి కరుణానిధి, ఇంద్రావత్ రవినాయక్‌లు మంగళవారం టీపీఎస్ భార్గవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాపూర్ చౌరస్తా సమీపంలో ఇటీవల తాజా హోటల్ పేరిట అనుమతులు తీసుకోకుండా షెడ్డు నిర్మించారని గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవం

తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివసత్తులు అగ్ని గుండం చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం కోసం ఉదయం నాలుగు గంటల నుంచి బారులు తీరారు. అమ్మవారికి నేవైద్యంగా బోనం సమర్పించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణం సందర్భంగా సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. పాండు రంగారెడ్డి ఇంట్లో ప్రత్యేకంగా అలంకరణ చేసిన అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రావిర్యాల నుంచి ఆలయం వరకు రోడ్లు పూర్తిగా భక్తజనంతో సందడిగా మారాయి. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఘటం నిర్వాహకులు పాండు రంగారెడ్డి, మీగడ కాశీనాథ్, మురళీ, దేవాదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ రుణమాఫీ

కందుకూరు: ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, రైతు వేదికల వద్ద ఏఈఓలు లేదా వ్యవసాయ అధికారులకు పూర్తి వివరాలతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, ఎస్.అజీజ్, ఎస్.జగన్, జి.సుధాకర్‌రెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, ఎ.జగదీష్, ఎస్.రాంరెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.పాండురంగారెడ్డి, జి.కుమార్, ఎస్.రాజిరెడ్డి, వి.బాబు, ఆర్.జంగయ్య, ఎ.సురేందర్, శేఖర్‌రెడ్డి, ఎన్.రాజశేఖర్ రెడ్డి, పి.రవి, హన్మంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.18, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.20, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.45, దొండ రూ.25, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.13, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.10, అర్వి రూ.23, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.21, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.55.

## చెరువులు, కుంటలకు జలకళ

మండల పరిధిలో సోమవారం 53 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. దీంతో చెరువులు, కుంటలు జలకళతో కళకళలాడుతున్నాయి. పులిమామిడి సొడమ్మ కుంట నిండి అలుగుపారుతోంది. అక్కడి నుంచి జైత్వారం నాయిని వాని చెరువులోకి భారీగా వరద చేరి నిండుకుండలా తలపిస్తోంది. ఈ సీజన్‌లో ఇదే పెద్ద వర్షమని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. – కందుకూరు



పులిమామిడిలో అలుగుపారుతున్న సొడమ్మ కుంట



తుక్కుగూడ: రావిర్యాల ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

## భారీ వర్షం..!

మీర్‌పేట: మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన మిథులానగర్‌ను వరదనీరు ముంచెత్తింది. కాలనీలోని రహదారులపై మోకాలి వరకూ నీరు చేరడంతో ఇంచార్జి కమిషనర్, డీఈ వెంకన్న సిబ్బందితో చేరుకుని వరదనీరు తాత్కాలికంగా వెళ్లేలా సహాయక చర్యలు చేపట్టారు.



మీర్‌పేటలోని మిథులానగర్‌లో రోడ్డుపై చేరిన వరద

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీ 18వ వార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండు నర్సింగ్ డిమాండ్ చేశారు. వార్డులో వారం రోజులుగా రోడ్డుపై పారుతున్న మురుగునీటిని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. కాలనీ ప్రజలు మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా.. స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇళ్ల మధ్య మురుగు పేరుకుపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని కోరారు.



రోడ్డుపై చేరిన మురుగు

లేని యెడలా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ముగిసిన నాటిక పోటీలు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని చంద్రకళా వేదికపై గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నవమ ఆహ్వాన పౌరాణిక పద్యనాటిక పోటీలు సోమవారంతో ముగిశాయి. జడ్చర్లకు చెందిన నవజ్యోతి కళామండలి వారు ప్రదర్శించిన మైరావణ నాటికకు ప్రథమ బహుమతి, ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శిన బ్రహ్మర్షి విశ్వామిత్రకు రెండవ బహుమతి, పటాన్‌చెరుకు చెందిన టీబీఆర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన స్వామి అయ్యప్ప నాటికకు తృతీయ బహుమతి, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటికకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి. ఉత్తమ నటుడిగా రఘురామశర్మ, ఉత్తమ నటిగా లీలావతి, ఉత్తమ ప్రతి నాయకుడిగా పాశ్వాచారి ఎంపికయ్యారు. విజేతలకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి చేతులమీదుగా మెమొంటో, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కన్వీనర్ వి.వి.సుబ్బారావు, అధ్యక్షులు పంపన వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, సోమయాజులు, పుండరీకాక్షుడు, సూర్యప్రకాష్, సత్యనారాయణ, రామచంద్రరావు, అచ్యుత రామయ్య, సూర్యనారాయణ, జైపాల్‌రెడ్డి, బుగ్గయ్య పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

## సంస్కార భారతి శారదానగర్ శాఖ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

వనస్థలిపురం: సంస్కార భారతి (జాతీయ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ) నూతన శాఖ సోమవారం రాత్రి వనస్థలిపురం శారదానగర్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శివాజీ మాట్లాడుతూ.. సంస్థ ప్రధాన ఉద్దేశాలు, విధి విధానాలను వివరించారు. దేశభక్తి, కళా, సాంస్కృతిక సామాజిక సేవా భావం కలిగిన వారు, ముఖ్యంగా యువతను తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకతను ప్రస్తావించారు. డా.శిరిపురపు అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆనంద్, అంజిరెడ్డి, కృష్ణకుమార్, సైదమ్మ, గోవిందాచారి, చంద్రమౌళి, లక్ష్మీదుర్గ, నరసింహం, ప్రసాద్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన అనంతరం భూపేష్‌గుప్తానగర్‌కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు కాలనీలకు చెందిన మహిళలు కార్పొరేటర్‌ సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్‌యాదవ్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారిగా శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీపీ ప్రసాదరావు హెచ్ఎండీఏకు బదిలీ అయ్యారు. మల్కాజిగిరి సర్కిల్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్‌యాదవ్‌ను ఎల్‌బీనగర్ జోనల్ రెగ్యులర్ ఇన్‌చార్జి సీపీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ అనుమతుల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. జోనల్ పరిధిలో సుమారు 39 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మంచాల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రజనీకర్ అన్నారు. మంగళవారం మండల పరిధి మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. ఉన్నతంగా ఎదగాలంటే క్రమ శిక్షణతో మెలగాలన్నారు. కష్టపడి చదువుకొని ఉన్న ఊరుకు, కన్న వారికి, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతులు తేవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ అలే కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సేవతోనే సమాజంలో గుర్తింపు

కడ్తాల్: సేవతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేశారు. అనంతరం అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్, యూత్ మండల అధ్యక్షుడు ఇర్షాద్, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, పాండు నాయకులు నర్సింహ్మ, సేవ్యానాయక్, బిక్కు నాయక్ , కృష్ణ,అంజి, సేవ్యానాయక్, నర్సింహ, సూర్య, రాజు, శంకర్, కృష్ణ, శ్రీను ఉన్నారు.

### హామీని నిలబెట్టుకోవాలి

తుర్కయంజాల్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు యాదిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

కందుకూరు: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జంగారెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ తన చివరి శ్వాస వరకు దేశాభివృద్ధి కోసం అవిశ్రాంతిగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. గాంధీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని దేశాన్ని ప్రగతి బాటలో నడిపించారని పేర్కొన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, ఎస్.అజీజ్, ఎస్.జగన్, జి.సుధాకర్‌రెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, ఎ.జగదీష్, ఎస్.రాంరెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.పాండురంగారెడ్డి, జి.కుమార్, ఎస్.రాజిరెడ్డి, వి.బాబు, జి.రాజు, ఆర్.జంగయ్య, ఎ.సురేందర్, శేఖర్‌రెడ్డి, ఎన్.రాజశేఖర్‌రెడ్డి, పి.రవి, ఎ.రాంరెడ్డి, హన్మంత్‌నాయక్ పాల్గొన్నారు.



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలి

మీర్‌పేట: ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకుడు మాదరి రమేశ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కురిసిన వర్షానికి ముంపునకు గురైన మీర్‌పేటలోని మిథులానగర్‌లో ఇంచార్జి కమిషనర్, డీఈ వెంకన్నతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షం వచ్చిన ప్రతిసారి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవ తీసుకుని గతంలో ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేయించారని గుర్తుచేశారు. దీంతో మిథులానగర్‌లో ప్రత్యేక లైన్ వేసేందుకు నిధులను కేటాయించినట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే ఆ నిధులను ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మిథులానగర్‌లో వరదనీరు చేరకుండా మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

## రుణమాఫీ కోసం రైతుల తిప్పలు

వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఇబ్రహీంపట్నం: మూడు విడతల్లో రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జూలై 18, 30, ఆగస్టు 15న మూడు విడతలుగా రుణమాఫీ చేసింది. ఇందులో లక్ష, లక్షన్నర లోపు మాఫీ కానీ రైతులకు మూడోసారి సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో అధికారులు తెలిపారు. కానీ మూడోసారి కూడా లబ్ధిపొందని అన్నదాతలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారులను నిలదీస్తున్నారు. దీంతో ఆధార్, బ్యాంకు ఖాతాలు మ్యాచింగ్ కాకపోవడం, ఒకే కుటుంబంలో రెండు లక్షల కంటే ఎక్కువ రుణం పొందటం, కుటుంబ నిర్ధారణ తదితర కారణాల వలన మాఫీ జరగలేదంటూ రైతులకు అధికారులు నచ్చ చెబుతున్నారు. తిరిగి కొత్తగా లబ్ధిపొందని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయినప్పటికీ.. ప్రభుత్వం తమకు రుణమాఫీ చేస్తుందో లేదోనని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నం వ్యవసాయ కార్యాలయంలో రుణమాఫీ కోసం ఆరా తీస్తున్న రైతులు

## పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య రక్షణ

మాజీ ఎంపీపీ నిర్మల

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంపీపీ తిర్మణి నిర్మల అన్నారు. ప్రస్తుత వర్షాలకు నీరు నిలువ ఉండడం, పరిశుభ్రత లోపించడం, తాగు నీరు కలుషితం కావడం వలన రకరకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మంగళవారం మండల పరిధి జంగారెడ్డి పల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. ఆమె ప్రారంభించారు. డాక్టర్ అఖిల్ నేతృత్వంలో 196 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు మల్లేశ్, చంద్రమౌళి, మోహన్‌రెడ్డి, మధు, వంశీ, మైసయ్య, మల్లయ్య, బుచ్చిబాబు, లక్ష్మయ్య, నరసింహ, యువకులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

యాచారం: విద్యుత్ ప్రమాదాలు జరిగితేనే అధికారులు పట్టించు కుంటారా అని కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ కావలి జగన్ ట్రాన్స్ అధికారులను ప్రశ్నించారు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, లో ఓల్టేజీ సమస్య తరచూ ఉత్పన్నమవుతుందని, దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇళ్లల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ సమస్యను తీర్చాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జగన్ ట్రాక్టర్ల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నీటిని పోయించారు.

## దోమల నివారణపై అవగాహన

ఎల్‌బీనగర్: వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దోమల నియంత్రణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడ ఎనాఫిస్ దోమవల్ల మలేరియా వ్యాధి వస్తుందనే విషయంపై సర్ రోనాల్డ్‌రాస్ 1897 ఆగస్టు 20న కనుగొన్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఇదే రోజు ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటున్నారని, దోమల వల్ల కలిగే వ్యాధులు, నివారణ మార్గాల పై అవగాహన కల్పిస్తున్నారన్నారు. దోమల నివారణకు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంటమాలజీ సిబ్బంది నరేందర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

## ఘనంగా జాతీయ సంస్కృత దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రంగాచార్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం శారదానగర్ శాంతినగర్ కల్వంచలో టెలికాం రిటైర్డు డీజీఎం బి.పరమేశ్వరుడు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సంస్కృత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సంస్కృత పండితులు పీటీజీవీ. రంగాచార్యుల దంపతులకు పాదపూజ, పండిత సత్కారం నిర్వహించారు. రంగాచార్యులు సంస్కృత భాష ప్రాముఖ్యం, ప్రస్తుత పరిస్థితుల్లో దాని అవసరాన్ని వివరించారు. డా.శిరిపురపు అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆచార్య వాసుదేవ్, చక్రవర్తుల శ్రీనివాసాచార్య, టి.యాదగిరి రావు, సీహెచ్.మంగపతిరావు, కళా వికాసరత్న చొడూరి నరసింహారావు, డా.ఏనుగు శివరామప్రసాద్, నాగప్రభాకర్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.